క్లుప్తంగా

లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ అధ్యక్షుడిగా వాసు



కెల్లా వాసు



మురళీరాజు



నెక్కంటి వెంకటేష్

నల్లజర్ల: లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ అధ్యక్షుడిగా కెల్లా వాసు ఎంపికయ్యారు. క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కాళ్ళ మురళీరాజు, కోశాధికారిగా నెక్కంటి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ క్లబ్ మెంబర్లు తాతిన సత్యనారాయణ,కూచిపూడి ఉదయభాస్కరావు, ఆచంట సత్యనారాయణ, మద్దుకూరి రామకృష్ణ, యోగా గురువు రాజారావు, బూరుగుపల్లి ఆంజనేయులు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి



చెల్లు సత్యసాయి వరలక్ష్మి(ఫైల్)

నల్లజర్ల: చీపురుగూడెం మాజీ సర్పంచ్ చెల్లు సత్యసాయి వరలక్ష్మి (60) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 2014 నుంచి 2019 వరకూ ఆమె సర్పంచ్‌గా పనిచేసి ఆ పంచాయతీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆమె భర్త వెంకట్రావు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, వైఎస్సార్ సీపీ నాయకుడు బళ్ల నాని, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అతిసారపై అప్రమత్తత అవసరం

నిడదవోలు రూరల్: చిన్నారులకు అతిసార వ్యాధి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మార్కొండపాడు పీహెచ్‌సీ వైద్యుడు పి.రవికుమార్ సూచించారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని డి.ముప్పవరం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల్లో ఈ వ్యాధి తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచిందన్నారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ కె.కనకరత్నం, హెల్త్ అసిస్టెంట్ బి.సురేష్, ఏఎన్ఎం పి.నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ కె.లక్ష్మీకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడ్లబండిని ఢీకొట్టిన లారీ

ఎద్దు మృతి, బండి యజమానికి గాయాలు



లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన ఎద్దు

తాళ్లపూడి: ఎడ్ల బండిని లారీ ఢీ కొట్టడంతో బండి బోల్తా పడి ఒక ఎద్దు మృతి చెందింది. మరో ఎద్దు గాయపడింది. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున తాళ్లపూడి ఏటిగట్టుపై చోటుచేసుకుంది. ఆ ఎడ్ల బండిని వైజాగ్ నుంచి గోపవరం వైపు ఎదురుగా బొగ్గు లోడుతో వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో బండిలో ఉన్న యజమాని శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

పారిశుధ్య నిర్వహణపై పీర్ కమిటీ పర్యవేక్షణ

నల్లజర్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్- 2023 కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో నియమించబడిన పీర్ కమిటీ గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను అధ్యయనం చేస్తోంది. గ్రామాలను పరిశుభ్రంగా మార్చడం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కమిటీలను ఏర్పాటు చేసింది. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను ఏవిధంగా తరలిస్తున్నారనే విషయాన్ని ఈ కమిటీ పర్యవేక్షిస్తోంది. ఈ కమిటీలో తెలికిచెర్ల సర్పంచ్ బండి చిననాగరాజు (చిట్టి), దూబచర్ల పంచాయతీ కార్యదర్శి బీవీ రత్నం, నల్లజర్ల అంగన్‌వాడీ కార్యకర్త శివకుమారి సభ్యులు. ఈ కమిటీ మే 12 నుంచి జూన్ 10 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో చెత్త సేకరణ, నిర్వహణ, సంపద తయారీ, డ్రైనేజీల నిర్వహణ తదితర 20 అంశాలను పరిశీలిస్తోంది. ఎన్ని రోజులకు ఒకసారి ఇళ్ళ నుంచి చెత్తను సేకరిస్తున్నారు? నాణ్యమైన వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారా? లేదా అనే అంశాలను పరిశీలిస్తారు.

ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధం

- సొసైటీలు, డీసీఎంఎస్ డిపోల్లో 12,012 మెట్రిక్ టన్నులు
- ప్రైవేట్ డీలర్ల వద్ద మరో 10 వేల మెట్రిక్ టన్నులు



అన్నవరప్పాడు సొసైటీ గోడౌన్‌లో సిద్ధంగా ఉన్న ఎరువులు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అన్నివేళలా అండగా నిలుస్తోంది. వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోంది. రైతులు సాగుకు ఉపక్రమించడానికి ముందుగానే వారికి అవసరమైన ఎరువులను వ్యవసాయ శాఖ ద్వారా సమకూరుస్తోంది. నిడదవోలు నియోజకవర్గంలో వరి సాగు విస్తీర్ణం 36,500 ఎకరాలు. అందుకు అవసరమైన ఎరువులను సొసైటీలు, డీసీఎంఎస్ ఎరువుల డిపోల్లో ఇప్పటికే సిద్ధం చేశారు. ముఖ్యంగా ఖరీఫ్ వరి పంటకు పొటాష్, యూరియా, సూపర్, కాంప్లెక్స్ ఎరువులను వినియోగిస్తారు. అందుకోసం అధికారులు 12,012 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచారు. ఇవే గాకుండా ప్రైవేట్ డీలర్ల దగ్గర మరో 10 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. దాంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువుల కొరత ఉండబోదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా అందుబాటులో ఉన్న ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

మండలం	యూరియా	సూపర్	కాంప్లెక్స్	పొటాష్
ఉండ్రాజవరం	1128	454	759	380
నిడదవోలు	1647	728	1089	554
పెరవలి	1757	688	1757	1071
	4532	1870	3605	2005

పుష్కలంగా అన్నిరకాల ఎరువులు



ఖరీఫ్‌లో యూరియా ఎక్కువగా వినియోగిస్తారు. అందుకే అవసరమైనంత యూరియా సిద్ధంగా ఉంచాం. సూపర్‌ను ఎక్కువగా దమ్ములు సమయంలో వినియోగిస్తారు. అలాగే మొక్కల వేరు కుదుళ్ల బలంగా ఉంచడానికి పొటాష్ ఉపయోగిస్తారు. కాంప్లెక్స్ ఎరువులు సమయాన్ని బట్టి రైతులు ఉపయోగిస్తారు. నియోజకవర్గంలో ఖరీప్ సాగుకు అవసరమైన అన్నిరకాల ఎరువులను సిద్ధంగా ఉంచాం. రైతులకు ఎరువుల కొరత రాబోదు.

–రమేష్, వ్యవసాయ సహాయ సంచాలకుడు, తణుకు

మహిళల ఆర్థికాభివృద్ధికి సమ్మాన్ సేవింగ్స్ స్కీం

'గూడెం' పోస్టల్ సూపరింటెండెంట్ సీవీ రామిరెడ్డి



కొవ్వూరు/గోపాలపురం: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అన్ని వయసుల మహిళలు, బాలికల పేరుతో పోస్టాఫీసుల్లో మహిళా సమ్మాన్ సేవింగ్ స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వం అధిక వడ్డీ అందిస్తోందని తాడేపల్లిగూడెం పోస్టల్ సూపరింటెండెంట్ సీవీ రామిరెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకూ పోస్టాఫీసుల్లో డిపాజిట్టు చేసుకో వచ్చని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.గతంలో కనీస డిపాజిట్ ఐదేళ్లుగా ఉండేదని, ఇప్పుడు రెండేళ్లకు కుదించారన్నారు. డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీ అందిస్తున్నామన్నారు. ఏప్రిల్ 1న ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. కొవ్వూరు, తాడేపల్లిగూడెం హెడ్ పోస్టాఫీసుల పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లోనూ ఈ పథకం ద్వారా ఈనెల 5 నుంచి 22 వరకూ డిపాజిట్లు స్వీకరిస్తారని వివరించారు. అకౌంట్ ఓపెన్ చేయడానికి మూడు పాస్ పోర్టు సైజు ఫోటోలు,ఆధార్, పాన్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో భూముల నిజనిర్ధారణ ప్రక్రియ



చిగురుల్లంకలో భూముల సర్వే వివరాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

కొవ్వూరు: మండలంలో భూముల డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాల్లో క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ ప్రక్రియ చేపట్టామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ వెల్లడించారు. ధర్మవరం, పెనకనమెట్ట, చిగురులంక, మద్దూరులంక, దేచెర్ల గ్రామాల్లో తొలి విడతలోను, ఐ.పంగిడి, మద్దూరు గ్రామాల్లో రెండో విడతలోను డ్రోన్ సర్వే పూర్తి చేశామన్నారు. ఈ గ్రామాలకు ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ)వచ్చిందన్నారు. ధర్మవరం, పెనకనమెట్ట గ్రామాల్లో రైతుల సహకారంతో క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ పూర్తయినట్టు ఆయన వెల్లడించారు. చిగురులంకలో ఏ రైతు పొలం ఏ సర్వే నంబర్‌లో ఉందో ఖచ్చితత్వ నిర్ధారణ కోసం మంగళవారం ఆ గ్రామంలో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేను తాము పరిశీలించామన్నారు.ఈ ప్రక్రియ కోసం నలుగురు సర్వేయర్లను నియమించామని చెప్పారు. ప్రతి సర్వే నంబర్ యొక్క జియో కో-ఆర్డినేట్స్‌ను సేకరించడం ద్వారా ప్రతి రైతు టైటిల్‌ను నిర్ధారించేందుకు క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ (గ్రౌండ్ ట్రూతింగ్) చేస్తున్నామన్నారు. రైతులు చూపించిన హద్దుల ప్రకారం వారి భూమి వివరాలను గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ సేకరిస్తారన్నారు.

ముమ్మరంగా భూముల రీ సర్వే

నిడదవోలు రూరల్: వివిధ గ్రామాల్లో భూముల రీసర్వే ముమ్మరంగా సాగుతోందని తహసీల్దార్ ఎం.గంగరాజు చెప్పారు. రావిమెట్లలో భూముల సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకూ 15 గ్రామాల్లో రీసర్వే చేపట్టామని చెప్పారు. రీసర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, వీఆర్వో సర్వేశ్వరరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోలు



ఎంపీడీఓ రాజశేఖర్

నల్లజర్ల: నల్లజర్ల ఎంపీడీఓగా ఎం.రాజశేఖర్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తాళ్లపూడిలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరిస్తున్న ఈఓపీఆర్డీ జోగేశ్వరరావు పదోన్నతిపై గన్నవరం నియోజకవర్గంలోని బావులపాడు ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఏడాదిగా ఇక్కడ ఎంపీడీఓ, కార్యాలయ ఏఓ పోస్టులు ఉన్నా డిప్యుటేషన్‌పై ఇతర మండలాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీడీఓ పోస్టు భర్తీ అయ్యింది. కార్యాలయ ఏఓ, ఈఓపీఆర్డీ పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

కొవ్వూరు ఎంపీడీవోగా సుశీల



కొవ్వూరులో సుశీలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు: కొవ్వూరు ఎంపీడీవోగా కె.సుశీల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండల ఈవోపీఆర్ అండ్ ఆర్డీగా పనిచేస్తున్న సుశీల పదోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కొవ్వూరులో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.ప్రసన్నకుమార్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్అండ్ ఆర్డీ కేవీఎస్ఏస్‌యూఎం శర్మ, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.

ఉండ్రాజవరం ఎంపీడీవోగా రాజు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ఎంపీడీవోగా జీవీఎస్ఆర్కే రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేసిన ఎ.శ్రీనివాసు ఇరగవరం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రాజునుమండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, యూటీఎఫ్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి



ఉండ్రాజవరంలో రాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న సిబ్బంది

అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేసి, ప్రమోషన్‌పై ఉండ్రాజవరం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు.

పంచాయతీ అధికారుల బదిలీ

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం, కలవలపల్లి పంచాయతీ అధికారులు బదిలీ అయ్యారు. కలవలపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జి.రాకేష్, జూనియర్ అసిస్టెంట్ రవిలు బ్రాహ్మణగూడెం పంచాయతీకి బదిలీ కాగా, బ్రాహ్మణగూడెం పంచాయతీ కార్యదర్శి పి.అనురాధ, జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటరమణమ్మలు కలవలపల్లి పంచాయతీకి బదిలీ అయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఎస్‌కే కమల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



సినీ హీరో కృష్ణ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య, అభిమాన సంఘాల నాయకులు

కొవ్వూరు: పట్టణంలోని మెరక వీధి వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన సినీ హీరో, సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ విగ్రహాన్ని ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల వీర వెంకట సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. కృష్ణ అభిమాని కేజీకే మోహన్ తన కిరణా దుకాణం ఎదుట ఆయన సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు మద్దుల సోమరాజు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కంఠమణి రమేష్, టీడీపీ నాయకుడు నున్న సాయి, అభిమాన సంఘం నాయకులు గుబతాల సురేష్, పారోజు జయరాజు, ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు), సంఘ నాయకులు మట్టే ప్రసాద్, నాళం వీర వెంకట శ్రీనివాసరావు, నాగవరపు హనుమంతు, మల్లిబాబు తదితరులు కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డ్రైన్లలో పూడికతీత పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు : రానున్న వర్షాకాలంలో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో డ్రైన్లలో పూడిక తీత పనులు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 20.22 లక్షల వ్యయంతో పట్టణంలో చేపట్టనున్న ప్రధాన డ్రైన్లలోని పూడిక తీత పనులకు మంగళవారం ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే చాన్‌బాషా, గంగుల గోపీయాదవ్, తోలేటి కోటేశ్వరరావు, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: ఐసీడీఎస్ కొవ్వూరు ప్రాజెక్ట్ పరిధిలోని తాళ్లపూడి, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీడీపీవో డి.మమ్మీ మంగళవారం తెలిపారు. దొమ్మేరు-2, కుమారదేవం-1, దొమ్మేరు-4, కాపవరం-2, కొవ్వూరు పట్టణంలోని తాయారమ్మ స్కూల్ వీధిలోని పదో నంబర్ అంగన్‌వాడీ కేంద్రం, పెద్దేవం -1, చాగల్లు -9, చిక్కాల-1వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. స్థానికులైన 21-35 ఏళ్ల మధ్య వయసు వివాహిత మహిళలు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం పదో తరగతి పాసై ఉండాలని, అదనపు విద్యార్హతలకు ప్రాముఖ్యత ఇస్తామన్నారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం ఐదింటి లోగా అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు అందజేసి తమ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు.

గోపాలపురం: ఐసీడీఎస్ గోపాలపురం ప్రాజెక్ట్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో వైబీటీ సుందరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవరపల్లి మండలం ఆవపాడు (బీసీ), త్యాజంపూడి (ఓపెన్), యర్నగూడెం (ఎస్సీ), గోపాలపురం సాగిపాడు (బీసీ-బీ), గుడ్డిగూడెం (బీసీ- డి)లకు కేటాయించినట్టు తెలిపారు. ఈనెల 13వ తేదీ లోగా గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె తెలిపారు.

నల్లజర్ల: మండలంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి వైబీటీ సుందరి తెలిపారు. ఆవపాడు-3 (బీసీ-ఏ)కి, నల్లజర్ల-4 (ఓపెన్ కేటగిరీ)కి, నల్లజర్ల-6 (ఎస్సీ)కు కేటాయించారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన తమ దరాస్తులను ఈనెల 13 లోగా గోపాలపురం ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఘనంగా శ్రీరామదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



శ్రీరామదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు రూరల్: మునిపల్లి గ్రామంలోని శ్రీరామదుర్గమ్మ వారి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్యలు అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి సత్తిపండు, రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం



దుర్గారావు కుటుంబ సభ్యులకు నగదు సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

గోపాలపురం: గోపాలపురానికి చెందిన మైనం దుర్గారావు అనే వ్యక్తి పది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1981- 82 బ్యాచ్ టెన్త్ విద్యార్థి. ఈ క్రమంలో ఆ బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తమ మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. తలా కొంత మొత్తం వేసుకుని, ఆ విధంగా సమకూరిన రూ.37 వేల నగదును మంగళవారం దుర్గారావు కుటుంబ సభ్యులకు అందజేశారు. తమతో చదువుకున్న పేద కుటుంబాలకు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్టు ఆ బ్యాచ్ టెన్త్ విద్యార్థులైన వైష్ణపు శ్రీనివాసరావు, అవుతు సత్యనారాయణరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు.

నల్లజర్ల సీఐగా నున్న రాజు



నల్లజర్ల: నల్లజర్ల సీఐగా నున్న రాజు మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమహేంద్రవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.లక్ష్మణరెడ్డి కొద్దిరోజుల క్రితమే వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐ నున్న రాజు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలసి మాట్లాడి పరిష్కరించుకోవచ్చన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ స్వాధీనం

కొవ్వూరు: కంటైనర్‌లో పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని మంగళవారం ఉదయం కొవ్వూరు పట్టణ పోలీసులు గామన్ ఇండియా బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద పట్టుకున్నారు. దీనిలో ఉన్న 44 గోవులు, ఎద్దులను గోకవరంలోని గోశాలకు తరలించినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. వై.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

చాగల్లు: జూన్ నెల రేషన్‌ను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో ఆమె సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రేషన్ ఈనెల 17 లోగా పూర్తి చేయాలన్నారు. ఎండీయూలు, డీలర్లు సమన్వయంతో పనిచేసి రేషన్‌ను సక్రమంగా లబ్ధిదారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు గాంధీ, కె.గణేష్, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఉండ్రాజవరం: స్థానిక భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం వేద మంత్రాలతో హోమాలు, పూజలు నిర్వహించారు. భక్తుల విరాళాలు సుమారు రూ.40 లక్షల వ్యయంతో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఈ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురువారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ, అన్నసమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు తాళ్లపూడిలో జాబ్ మేళా

తాళ్లపూడి: స్థానిక కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మానవత సంస్థ మండల శాఖ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు సూచించారు. కరిబండ విద్యాసంస్థలు, వికాస సంస్థ తోడ్పాటుతో మానవత సంస్థ ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. ఏర్పాట్లపై మంగళవారం సమావేశం నిర్వహించారు. జాబ్‌మేళా నిర్వహణకు గ్రామ వలంటీర్లు సహకరించాలని కోరారు. మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 21 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు 900 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.

స్కూళ్లకు విద్యాకానుక కిట్ల తరలింపు



గోపాలపురం స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్ల తరలింపు

గోపాలపురం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను తెరవకముందే జగనన్న విద్యాకానుక కిట్లను అన్ని స్కూళ్లకూ సరఫరా చేస్తామని కొయ్యలగూడెం డీవైఈవో ఆర్.రామన్నదొర అన్నారు. స్థానిక గురుకుల బాలికల పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్ల సరఫరాను మంగళవారం ప్రారంభించారు. ఎంఈఓ జి శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన శ్రీనివాస్ నాయుడు



ముఖ్యమంత్రి జగన్‌కు నియోజకవర్గ విషయాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలనకు మంగళవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సీఎం జగన్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను, పలు ఇతర అంశాలను ముఖ్యమంత్రికి వివరించినట్టు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తెలిపారు.